# ఆకాశంబున నుండి

పి. సత్యవతి

**మునిమాపు వేళ ముసిరిన చీకట్లను తరుముతూ ఒక్కసారిగా దీపాలన్నీ వెలిగాయి.**

ఆ వెలుగు వీధి చివర నిలబడ్డ ఆ అమ్మాయి మొహం మీదొచ్చి పడింది. అంత వెలుగు భరించ లేనట్లు ఆమె ఒక్కసారి కళ్ళు మూసుకుంది.

ఆమె ప్రక్కన నిలబడ్డతను "రిక్షా తెస్తానుండు" అన్నాడు.

అల్లంత దూరంలో నిలబడ్డ ఇంకొకతను ఖరీదైన బట్టల్లో వున్నాడు. ఖరీదైన సిగరెట్టు త్రాగుతూ, ఖరీదైన సెంటు వాసనతో ఖరీదు ఖరీదుగా వున్నాడు. అతను ఆ అమ్మాయి మొహంలోకి సంతృప్తిగా చూసి నవ్వాడు.

యవ్వనం ప్రసాదించిన శరీర సౌష్ఠవం - నన్నని చీరలో దాగని వొంపు సొంపులు ఆమె అందగత్తె అని చెబుతున్నాయి. కొంచెం ఎక్కువగా అద్దిన పౌడరు, పెన్సిల్ గీతలా వున్న కనుబొమ్మలు ముదురు రంగు లిప్‌స్టిక్ ముదురు రంగు వేసిన పొడవాటి గోళ్ళు, కత్తిరించి వదిలేసిన జుత్తు - ఆమె కొంచెం ఎక్కువగానే అలంకరించుకున్నట్టు చెబుతున్నాయి. మెడలో నల్ల పూసలు, సన్నని చీరలోంచి కనపడే మంగళ సూత్రాలు ఆమె గృహిణీత్వాన్ని చాటుతున్నాయి. ఆమె ముఖ కవళికలు మాత్రం ఏం చెప్పడం లేదు.




"ఏయ్ రిక్షా" అని పిలిచాడు మొదటి అతను. అక్కడకు కొంచెం దూరంలో సిగరెట్టు అప్పుడే ముట్టించుకుంటున్న రిక్షా అతను - దాన్ని ఆబగా రెండు దమ్ములు పీల్చి, విసిరి పడేసి వడివడిగా అక్కడికొచ్చేడు.

"అమ్మగారు - అమ్మగారు హోటల్ దగ్గర దిగుతారు. జాగ్రత్తగా తీసుకెళ్ళు. అయ్యగారు పది రూపాయిలిస్తారు తీసుకో. కొంచెం దూరం కదా" అన్నాడు.

రిక్షావాళ్ళని జనం సాధారణంగా 'ఏయ్ రిక్షా' అని పిలుస్తారు గనుక అతన్ని కూడా 'రిక్షా' అనొచ్చు. రిక్షాకి ఈ అయ్యగారు అమ్మగార్ల వ్యవహారం క్రొత్తేం కాదు. ఏ అయ్యగారు అమ్మగారు అంత దూరం రిక్షా ఎక్కరు. పది రూపాయిలివ్వరు. "ఎక్కండి" అన్నాడు ముఖం

చుకుని తిరుగుతున్న అయ్యగార్ని - "ఏం బాబూ ఏం చేశావ్?
మా ఆవిణ్ణి కాటేయడానికి ఎందుకు చూశావ్?" అని నిలదీద్దామా అనుకున్నాడు. ఎంతైనా ఆళ్ళజోలికి పోడం మంచిది కాదని తీర్మానించుకున్నాడు. అతను మారీదు కళ్ళు తుడిచేడు - "ఏడవమాక! ఆదు నీ ఎనకెనకే తిరిగాడు గానీ ఏన్నేం చెయ్యలేదు గదా. ఇంకో ఇంట్లో పని చేద్దువులే" అని సముదాయించేడు.

దేవుడిలాంటి ఆ అయ్యగారు అమ్మగారు చూడకుండా తన భుజం మీద చేతులు వేసి తనని ముద్దు పెట్టుకున్నాడనీ, తనతన్ని వెనక్కి తోసేసి గబగబా వచ్చేసిందనీ మారీదు చెప్పలేదు.

మళ్ళీ అదే సాయంత్రం తన వెనకే వచ్చి అలాంటి పనే చెయ్యబోయేటప్పుడు అమ్మగారు అటుగా వచ్చిందనీ, వెంటనే తనని ఇంటికి వెళ్ళి పొమ్మందనీ కూడా చెప్పలేదు. అతను తనని వెంటాడుతున్నాడని, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తున్నాడనీ, కాళ్ళల్లో కాళ్ళు వేసి నడుస్తున్నాడనీ మాత్రం చెప్పింది. అయ్యగారు చేసిన తప్పుకి అమ్మగారు తనని తిట్టడం ఎందుకో మారీదుకి అర్థం కాలేదు. తనేదో ఆయన్ని వెడగొట్టేస్తున్నట్లు బాధ పడిపోయింది. ఆవిడ దృష్టిలో అయ్యగారు మంచి వాడే. తనే చెడిపోయిన ఆడది!! ఆవిడ భర్తని వెడగొట్టడమే పనిగా పెట్టుకున్న ఆడది తను! ఒక మాటలో అమ్మగారిలో విపరీతమైన మార్పొచ్చింది. ఆమె అనే మాటల్లో - చూసే చూపుల్లో కత్తులు కనిపిస్తున్నాయి. శాపాలు వినిపిస్తున్నాయి.

నారాయణ మారీద్ని సముదాయిస్తూనే ఉలిక్కి పడ్డాడు. ఈ మారీదు అందం కళ్ళు చెదిరే అందం అనీ, దీని శరీరానికి ఎందర్నో ఆకర్షించే శక్తి వుందనీ, అందుకని మారీదు బయటకి వెడితే ఇలాంటివి ఎదురౌతాయని తానెన్నడూ అనుకోలేదు. దాని అందం తన ఒక్కడి సొమ్మేనని, దాని శరీరం, మనస్సూ తన కొక్కడికే స్వంతం అనీ అనుకుంటున్నాడు. వాటిని ఇతరులు ఆశిస్తారని ఎన్నడూ అనుకోలేదు.

దుష్ట శక్తుల నుండి దాన్ని ఎలా కాపాడుకోవాలి? బయటికి పంపకపోతే గడవని ఆర్థిక పరిస్థితి వచ్చింది. పంపితే సచ్చుకామెర్ల వెధవలందరి కళ్ళూ దాని మీదే! అలా ఆలోచిస్తున్న నారాయణ మనస్సులోకి ఇంకో ఊహ జొరబడింది. రెండేళ్ళ నాడు ఇంకా ఉషారుగా, ఇంకా షోగ్గా, యింకా పొగరుగా వుండేది మారీదు. మరలాంటిది ఆ అయ్యగారు ఇన్నాళ్ళు ఎందుకు నిగ్రహం చూపించేడు? ఇప్పుడే ఇలా ఎందుకు ప్రవర్తించేడు? అమ్మగారలా ఎందుకన్నది? మారీదు నిజమే చెబుతోందా! ఎర్రగా బుర్రగా వుండి సెంటు కొట్టుకుని నున్నంగా గడ్డం గీసుకున్న ఆ మనిషి మీద మోజు పడిందా? ఆ ఊహ మహాభయంకరంగా అనిపించింది. ఛీ ఛీ అనుకున్నాడు. ఆ రాత్రి అతను మారీణ్ణి దగ్గరగా తీసుకుని కళ్ళ మీద ముద్దెట్టుకోలేదు. వీపు మీద చెయ్యేసి నిమరలేదు. గాజులు సవరించలేదు. ఆకాశం కేసి చూస్తూ వుండిపోయేడు. తన పెళ్ళయినాక ఎన్నడూ లేనిది ఆ రాత్రి ఎంతకీ తెల్లవారలేదు. ఇన్నాళ్ళూ అతని గుండెల నిండా కాపురం వున్న మారీదు బతుకు అశాంతి వచ్చి చేరుతోంది. ఆ వాడలో వున్న పది పదిహేనిళ్ళల్లో తన భార్యని చూసుకున్నట్టు ఎవరూ చూసుకోరు. అందులో చాలామంది భార్యల్ని బూతులు తిడతారు. తాగొచ్చి తంతారు. అక్కడ కొత్తగా కట్టిన ఫ్లాట్స్‌లో ఆ వాడలోని ఆడవాళ్ళు పనిచేస్తున్నారు. మొగవాళ్ళు రిక్షాల వాళ్ళు వాళ్ళ పిల్లల్ని స్కూళ్ళకి చేరవేస్తున్నారు. ఫ్లాట్స్ ప్రక్క గుడిసెలుండడం వాళ్ళ అదృష్టం కాగా, గుడిసెల ప్రక్కనే గొప్పోళ్ళ ఇళ్ళుండడం తమ అదృష్టం అని కొంతమంది ఆడవాళ్ళు అనుకుంటున్నారు. ఎక్కువ దూరం నడిచి పోకుండా పని దొరికినందుకు - అంతేకాదు - ఈ గుడిసెలూ, ఆ కట్టిన ఫ్లాట్లూ కూడా మార్కెట్‌కి దూరంలోనే వున్నాయి కనుక - బేరాలు బాగానే దొరుకుతున్నాయి. ఆ ఫ్లాట్స్‌లో వుండే ఆడవాళ్ళల్లో కొంత మంది ఉద్యోగాలకి వెళ్ళగా, కొంతమంది ఇళ్ళల్లోనే వుంటారు. అలా ఇళ్ళల్లో వుండిపోయిన ఆడవాళ్ళు ఒకరింటికి ఒకరు వెడుతూ వస్తూ వార్తలు సేకరించి, చేరవేస్తుంటారు. రెండేళ్ళ నించీ ఫలానా కామేశ్వరి గారింట్లో ఎంతో వినయ విధేయతలతో పనిచేసిన మారీణ్ణి ఆవిడ మానిపించడానికి కారణం అక్కడ చర్చనీయాంశం అయింది.

"పని వాళ్ళని తీసెయ్యడానికి రెండు కారణాలుంటాయి. ఒకటి దొంగతనం, రెండవది ..." అని ఓ వ్యంగ్యమైన నవ్వు విసిరింది ఒక ఇల్లాలు.

మారీదు అందం మీద, అలంకారం మీద వ్యాఖ్యానించింది ఇంకొక ఇల్లాలు. ఏమైనా మారీదులా వుండే




ఆడవాళ్ళని పనిలోకి రానివ్వడం చాలా ప్రమాదకరం అని మెజారిటీ సభ్యులు తేల్చేరు. "ఇవ్వాళ కామేశ్వరి కైంది - రేపు మనకి" అని వాళ్ళు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఫస్టు వరకు పిల్లల్ని రిక్షాలో పంపిన కామేశ్వరి ఫస్టు నించీ పిల్లల్ని భర్తతో స్కూటర్ మీద పంపడం మొదలెట్టింది.

"పెళ్ళాన్ని పనిలోంచి తీసేశానని కచ్చిపెట్టుకుని పిల్లల్నేమైనా చేస్తాడేమోనండీ" అని ఆవిడ భర్త దగ్గర బాధ పడింది.

ఇదంతా తనకి జరిగిన అవమానంగా భావించేడు నారాయణ. నారాయణ ఇప్పుడు సూరీడుకి మల్లెపూలు తేవడం తరుచు మర్చిపోతున్నాడు. అది అద్దం దగ్గర నిలబడి తల దువ్వుకుంటున్నా, బొట్టు పెట్టుకుంటున్నా "నాల్లే సోకులు" అని నిముక్కుంటున్నాడు. ఇలాంటి అందమైన ఆడదాన్ని పెళ్ళి చేసుకుంటే దాన్ని కంచు కోటలో పెట్టి కాపాడుకునే స్తోమతు వుండాలి. బయటికి పంపి నలుగురూ ఏదో అన్నారని వాపోవడం ఎంత మూర్ఖత్వం? అసలు సూరీణ్ణి తను పెళ్ళి చేసు కోడమే తప్పు. ఓ నాలుగయిదు వేలు అప్పు తెచ్చి ఎవరికైనా ముడిపెట్టి పంపేస్తే బావుండేది. ముసలిదాని మాట విని ఈ నిప్పుని తెచ్చి తన యింట్లో పెట్టు కోవడం ఎంత పొరపాటైంది! సూరీడు ఖాళీగా లేదు. మళ్ళీ పనిలో చేరింది. ఫ్లాట్స్‌లో కాదు - ఇంకొంచెం దూరం ఒక డాక్టర్ గారింట్లో. జీతం ఎక్కువే! పని ఎక్కువే, పని గంటలూ ఎక్కువే! సూరీడుకి కష్టం ఎక్కువైంది. దానితో నారాయణ నిఘగూ ఎక్కువైంది. వారూ వీరూ అనే మాటలు పట్టించుకోడమూ ఎక్కు వైంది. నారాయణ సిగరెట్లు కాలుస్తున్నాడు. ఓనాడు ఆ వాడలో వుండే వెంకయ్యతో కలిసి తాగి కూడా వచ్చాడు.

ఇదేమిటని సూరీడు నిడిస్తే దాన్ని కొట్టేడు. భయం కరంగా తిట్టేడు. లేనిపోని రంకులు అంటగట్టాడు. అది తెచ్చే డబ్బు లేనిదే చీటీలు తీరవు. అది ఏం చేస్తోందోనని భయం. అడపా దడపా ఇంట్లో పండగలూ, పార్టీలూ వచ్చి ఆలస్యం అయినా, అయిదూ పదీ ఎక్కువ యిచ్చినా 'ఇది ఎక్కడిది - ఇంతాలస్యం ఏమిటి?' అని ఇష్టం వచ్చినట్లు వాగుతున్నాడు నారాయణ.

సూరీడుకి చెప్పుకుని ఏడవడానికి ఎవరూ లేరు. ముసలిది కూడా చచ్చిపోయిందాయె! తను చేసిన తప్పే మిటో తాను చేయని తప్పుకి శిక్షేమిటో, నారాయణ మనస్సులో మార్పేమిటో సూరీడుకి అంతుచిక్కడం లేదు.

సూరీడు దిగులుపడింది. తెల్లగా చెరువులో చిన్న చేపపిల్లల్లా తళుకు తళుకుమనే ఆమె కళ్ళల్లో దిగులు తెరలు. పచ్చగా మిసమిసలాడిపోయే శరీరం మీద దెబ్బలు. మనస్సుకి తెలియని ఆవేదన. సూరీడుకి నారాయణంటే వుండే భక్తి, గౌరవం, ప్రేమా సడలి పోతున్నాయి. సున్నితంగా దగ్గరకు తీసుకుని లాలించే అతనిలో తనకి ఇదివరకు అమ్మ కనిపించేది - ఇప్పుడు తనలో లాలిత్యం లేదు. అతని ప్రేమలో మొరటుతనం వచ్చింది. సాయంత్రం కోసం ఆరాటం లేదు. తెల్లవార కూడదనే కోరిక లేదు. 'ఎప్పుడూ పగలే అయితే పని చేసుకుంటూ బతకవచ్చు. రాత్రి నరకం' అనుకుంది సూరీడు.

అప్పుడు సూరీడుకి పరిచయం అయినాడు అప్పల కొండ. అప్పలకొండ పళ్ళమ్ముకునే సింహాచలం కొడుకు. సింహాచలం మొగుడు రిక్షా తోలతాడు. సింహా చలం పళ్ళు అమ్ముతుంది. కొడుకు ఏమీ చెయ్యడు. వాడు ప్యాంటూ షర్టూ వేసుకుని విలాసంగా సిగరెట్టు కాలుస్తూ వుంటాడు. వాడు సూరీడు కష్టం, సుఖం కనుక్కున్నాడు. ఆదరించేడు. ఆవేదన ప్రకటించాడు. 'పాపం' అన్నాడు. "మనిద్దరం యిశాపట్నం ఎల్లిపోదాం పద — నిన్ను పువ్వుల్ల పెట్టి సూసుకుంటా"నన్నాడు. ఆమెని రోజూ పనిదాకా దిగబెట్టడం - ఇంటికి తీసుకు రావడం చేస్తున్నాడు. ఓ రోజు వాళ్ళిద్దరూ కలిసి నడవడం చూసిన నారాయణ ఆ రాత్రి సూరీణ్ణి కొట్టిన దెబ్బలకి ఆ పిల్ల చచ్చిపోయి వుండవలసింది — కానీ బతికింది. చచ్చి బతికిన సూరీడు వారం తిరక్కుండా వూరు నుంచీ మాయమైంది. అది లేచిపోయే రకమేనని ఆ వాడకంతా ముందే తెలుసుననీ, అందుకని వాళ్ళకేం ఆశ్చర్యం లేదనీ అనుకున్నారు. "నీ పీడ విరగడయ్యిం దిరా నారాయణా — పెళ్ళయి మూడేళ్ళయినా ఓ కాయా, కసరా? మళ్ళీ నిచ్చేపంగా మనువాడు. ఈ సారైనా మామూలు ఆడదాన్ని పెళ్ళాడి సుకంగుండూ. నీ దరిద్రం తీరిపోయింది" అని కొందరు నారాయణకి హితవు చెప్పారు. ఆ చెప్పిన వారిలో దేవుడిలాంటి అయ్యగారు, దేవత లాంటి అమ్మగారు కూడా వున్నారు. ఆ అమ్మగారు తన పిల్లల్ని మళ్ళీ నారాయణ రిక్షాలోనే స్కూలుకు పంపడం మొదలెట్టింది. సూరీడు వెళ్ళి పోవడం చాలా మందికి బావుంది. నెల రోజులకి నారాయణ మూడు వేలు కట్నం తీసుకుని మహాలక్ష్మిని మనువాడాడు. ఈసారి భార్యని అతను అందరు భార్య ల్లాగే చూస్తున్నాడు. ఏడాది తిరిగేసరికి ఆ భార్య అతనికి ఓ మగపిల్లాణ్ణి కని యిచ్చి — అతనిలోని సూరీడు జ్ఞాపకాలని పూర్తిగా తరిమేసింది.

అప్పలకొండతో యిశాపట్నం వెళ్ళిన సూరీడు గతి ఏమైంది? అని అడగవద్దు - ఓ ఆరు నెలలకి అప్పల కొండ మళ్ళీ ఈ వూరే తిరిగొచ్చి "నానేం దాన్ని లేపుకపోలేదు - దాని పనిమీద అది పోయిందేమో" అని కాలరు ఎగరేసుకుని తిరుగుతున్నాడు. సూరీణ్ణేం చేశావో చెప్పమని నారాయణ అడగలేదు. సూరీడు అతనికిక అక్కర్లేదు. లోకంలోని మనుష్యులంతా ఏమైపోతే తనకేం అనుకున్నాడు. అతని గుండెలోకి మళ్ళీ శాంతి ప్రవేశిం చింది. అప్పలకొండ చెప్పకుండా వెళ్ళిపోయేనాటికి సూరీడులో కొన్ని వదిలేసింది. ఆమె మనస్సు భగ్గున మండింది. శరీర కష్టం చేసుకుని రాళ్ళు మోసీ, సున్నం పని చేసీ బతకబోయినా, అక్కడా పాములుంటాయి. జంతువులుంటాయి. జంతువులు తనని వేటాడతాయి. ఎక్కడా భద్రత లేదు. 'వేటాడే కళ్ళ నించీ - వెంట పడే మృగాల నుంచీ తన కేది రక్షణ? ఎక్కడ రక్షణ?' అని ఆక్రోశించింది సూరీడు. అప్పుడు ఆమెని రక్షించేడు భగవాన్‌దాసు. "నీ బతుకు ఎలా తెల్లవారాలో నేను చెబుతాను పద" అని ఆమెని తీసుకువెళ్ళాడు. వారం రోజులు మంచి భోజనం పెట్టేడు. బ్యూటీ పార్లర్‌కి తీసుకువెళ్ళి కనుబొమ్మలు కత్తిరింపించేడు. జుత్తు కత్తి రింపించేడు.

"సూరీడూ! నువ్వు ఎవరనుకుంటున్నావు? నువ్వు మోహినివి! భూలోక వాసులకు అమృతం పంచి పెట్ట డానికి వచ్చిన దానివి! నీ యోగ్యతలు, నీ అర్హతలు నీకు తెలీవు. నీ పాదాల దగ్గర ఎంత మంది భక్తులు వాలి పోతారో నువ్వు ఎరుగవు. నా మాట విని దీపం వుండగానే నీ ఇల్లు చక్కదిద్దుకుని నా ఇల్లు చక్కదిద్దు! రాజకీయ నాయకుల్లో కొంతమందితో, ఆఫీసర్లలో కొంత మందితో, వ్యాపారస్తులలో కొంత మందితో పని చేయించుకోడానికి నువ్వు అమోఘంగా పనికొస్తావు! అందం నీకు భగవంతుడిచ్చిన వరం. దాన్ని ఎలా వుపయోగించుకోవాలో నేర్చుకో" అని బోధించాడు. కాదంటే కొంత బాధించాడు. చివరికి ఒప్పించేడు. భగవాన్ దాస్ సూరీడుకి గిల్టు మంగళసూత్రాలు, నల్ల పూసలు కొనిచ్చాడు. ఆ రెండింటి వల్ల ఎన్నో లాభాలు వున్నాయని చెప్పాడు. నువ్వు గృహిణిలా కనపడతా వన్నాడు. వాళ్ళిద్దరూ ఈ వూరే వచ్చి మేడల పక్కన ఓ వాటా తీసుకుని కాపురం పెట్టేరు.

కుటుంబంలోని సుఖంతో సంతృప్తిపడని దేవుడి లాంటి అయ్యగారెంత మంది సూరీణ్ణి తీసుకుని క్యాంపుల కెళ్ళినా దేవతలాంటి అమ్మగార్ల కిప్పుడు తెలీదు. అలా ప్రస్తుతానికి స్థిరపడింది సూరీడు. దేదీప్య మానంగా వెలిగిపోతున్న హోటలు ముందు రిక్షా ఆగింది. అయ్యగారు 'రిక్షా'కి డబ్బులిస్తున్నాడు. అమ్మ గారు అతని పక్కన నిలబడింది. రిక్షా నారాయణకి జుత్తూ, కనుబొమలు కత్తిరించుకున్న ఆడవాళ్ళంటే అసహ్యం. ఒత్తుగా పెరిగిన కనుబొమ్మలు, బారెడు జడ ఎంత అందం ఆడపిల్లలకి! ముఖం నిండా అసహ్యం నింపుకుని ఆమె వైపు చూశాడు నారాయణ.

ఆమె వెనక్కి తిరిగింది. అలా తిరుగుతుండగా ఆమె ఎడమ చెంప మీద వున్న పుట్టుమచ్చ అతని కంట పడింది. ఆ పుట్టుమచ్చ అతని గుండెలో చురకత్తిని దించింది. 'తానా ఈమెని రిక్షాలో తెచ్చి ఇక్కడ దించింది! తానేనా?'

